క్లుప్తంగా

సుందర్‌కు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు



ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన వై.సుందర్‌కు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) సంస్థ అందించే నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వ హించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్‌లూక్, ఏఐసీఎఫ్ ఫౌండర్ విజయరాజు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం సుందర్ నరసరావుపేటలో ఇండియన్ క్రిస్టియన్ పాఠశాల లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సుందర్‌కు అవార్డు రావడంపై పలువు రు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో స్వాములకు అన్నదాన కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. మాలధారులైన అయ్యప్పస్వాములు మధ్యా హ్న సమయంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బాబు తెలిపారు. భక్తుల సహకారంతో ఇప్పటికే 15 ఏళ్లుగా ప్రతి ఏటా అక్టోబర్ నెల నుంచి జనవరి నెల మొదటి వారం వరకు అయ్యప్పలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు వందమంది వరకు అయ్యప్పలకు అన్నదానం చేస్తున్నామన్నారు. అనంతరం అయ్యప్పస్వామికి పూజలు చేసి అన్నదానం చేశారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు-గ్రామసింహాలు



దుగ్గిరాల: మండల కేంద్రంలో వానరాలు-గ్రామసింహాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. మూడు రోజుల నాడు స్థానిక సినిమా హాలు సెంటరు మీదుగా వెళ్తున్న ఓ వ్యక్తిని వరాహం అడ్డు రావడంతో కిందపడ్డాడు. ప్రస్తుతం తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఇక కుక్కలు, కోతులు వల్ల సమస్య ఇంతా అంతా కాకుండా ఉంది. బుధవారం గ్యాస్ సిలెండర్ ఇవ్వడానికి వచ్చిన బాయ్‌ను దుగ్గిరాలలో కుక్క కరిచింది. ఆయన చేతికి గాయమైంది. సంఘటన జరిగినప్పుడు నివారణ చర్యలు చేపడతామంటూ అధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నా పరిష్కారం మాత్రం కావడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వీటి నియంత్రణపై మండల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తాం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ దళితనాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. అనంతరం బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ నిరసనగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి మేళం భాగ్యారావు, కార్యదర్శి టి.ప్రసాద్, జిల్లా పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి వై.ప్రకాష్, దాసరి సురేష్, ఆర్.ప్రసాద్, పి.సీతారామరాజు, కాకి రామారావు, జి.ఇజ్రాయిల్, సాగర్, కె.సంతోష రావు, ఎస్.ఫ్రాన్సిస్, జి.శ్యామ్‌లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం బసవతారక నగరం వద్ద బుధవారం రాత్రి మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ ఎదుగా వస్తున్న మరో కారును ఢీకొట్టాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అత్యవసర పనిమీద వెళ్లిపోయారు. అయితే మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ కొంత దూరం వెళ్లిన తరువాత బసవ తారక నగర్ కూడలి మలుపు వద్ద రోడ్డుపక్కనే నిలిపి ఉంచిన టిఫిన్ బండితో పాటు, సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. ఆ కారులో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు ఉన్నారని, అందరూ మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. అదే సమయానికి వర్షంకురియడంతో రోడ్డుపై ఎవరూ లేరని, లేకుంటే ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు వెల్లడించారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుని కారును స్టేషన్‌కు తరలించారు.

మోతడకలో రీ సర్వేను ప్రారంభించిన జేసీ

రైతులు సిబ్బందికి సహకరించి భూములు సర్వే చేయించుకోవాలని సూచన



రీసర్వే ప్రారంభిస్తున్న జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ

తాడికొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, మోతడక గ్రామంలో జరుగుచున్న రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ పరిశీలించారు, రైతులతో మాట్లాడి సర్వే జరిగే ప్రక్రియ సజావుగా సాగుతున్నాయా లేవా అని తెలుసుకున్నారు.

రైతులతో మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రైతులకు భవిష్యత్తు లో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని సమస్యలు పరిష్కారం జరుగుతాయి కనుక రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే పవన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, డిప్యూటీ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే సీహెచ్ మల్లిఖార్జున, తహసీల్దార్ మోహర్ కుమార్, మండల సర్వేయర్ సాంబశివరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జీఎస్టీపై అవగాహన సదస్సు



విద్యార్థులకు ప్రశంసా పత్రం అందిస్తున్న అధ్యాపకులు

దుగ్గిరాల: జీఎస్టీ కేంద్రం తగ్గించిన శ్లాబ్‌లపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కె.ఆర్.ఆర్.ఎం కళాశాల ప్రిన్సిపాల్ కొత్త గిరిధర్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు కె.వీరయ్య, జి.నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు జీఎస్టీ పై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొదిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీతం ఇవ్వకపోతే జీవనం ఎలా?

దుగ్గిరాల: ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్న నలుకుర్తి కోటేశ్వర రావుకి జీతం ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తున్నాదని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రలోని దుగ్గిరాల పోలీసు స్టేషన్‌లో కోటేశ్వర రావుతో కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగ దళిత సామాజిక వర్గానికి చెందిన కోటేశ్వర రావు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ బ్రాంచిలో అసిస్టెంట్ పని చేస్తున్నారని వారికి యాజమాన్యం ఇవ్వాల్సిన వేతనం క్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయటం దారుణమన్నారు. కోటేశ్వర రావు మాట్లాడుతూ కక్షపూరితంగా ఐదు నెలలకు ఒకసారి జీతం ఇస్తే కుటుంబం పోషణ కష్టంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏటుకూరి విజయ్ మాదిగ, సుదాకర్ మాదిగ, జిల్లా నాయకులు కొమరాల శ్రీనివాస రావు మాదిగ పాల్గొన్నారు.

పుష్కరకాలనీ బాధితులకు న్యాయం చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కర కాలనీ బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పుష్కర కాలనీ ప్రాంతాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా పాలక పార్టీలు పుష్కర కాలనీ వాసులకు ఇస్తామన్న రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పటి దాకా ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతున్నామన్నారు. అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతూ అర్జీలు స్వీకరించామని, ఈనెల 17వ తేదీ ఎంటీఎంసీ కార్యాలయం వద్ద వాటిని అందజేయనున్నా మని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వారికి సీపీఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి కట్ట మేరి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడల్ని సందర్శించిన సీపీఎం నాయకులు



దళిత వాడలో నిలిచిపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో ఉన్న దళిత వాడలను సీపీఎం నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అద్దెలుకట్టుకోలేక గత 30 సంవత్సరాలు నుంచి ఒకే ఇంటిలో మూడు కుటుంబాలతో జీవితాలను కొనసాగిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇళ్ల స్థలాలు ఇస్తాం అంటున్నారే కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు.

దళిత వాడల్లో డ్రైయినేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, ఎక్కడ మురుగు అక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ దోమలు వృద్ధి చెంది విష జ్వరాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికే నీరు పోయే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచి పాచిపట్టి పెద్దలు, చిన్నారులు జారిపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఆత్మకూరులో మున్సిపల్ కమిషనర్ పర్యటించినపుడు మెయిన్ బజారులో తిరిగి వెళ్లిపోయారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు దళితవాడలను పర్యటించి ఆ ప్రాంతసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దుర్గారావు, సీపీఎం శాఖ కార్యదర్శి గద్దం అజయ్‌కుమార్, చింతల చెరువు జాన్, పులివర్తి ప్రసాద్, ఆంజనేయులు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



ఆర్. జాహ్నవి

తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి అథ్లెటిక్స్‌లో పెనుమాక విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ.అరుణశ్రీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి అథ్లెటిక్స్‌ను పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారని, కె. సెల్సియా (9తరగతి) డిస్కస్ పోటీలలో అండర్ 17 బాలికల విభాగంలో మొదటి స్థానం, షాట్‌పుట్, జావలిన్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిందని, షాట్‌పుట్ నందు ఆర్. జాహ్నవి (10వ తరగతి) ద్వితీయ స్థానం, అండర్ 14 షాట్‌పుట్ బాలుర విభాగంలో సి.హెచ్. సుభాష్ (8వ తరగతి) మొదటి స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల పి.డి. సూర్యప్రకాశ రావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు లాల్‌చంద్, ఎస్ఎంసీ చైర్మన్ భవాని తదితరులు అభినందించారు.

స్థానిక ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ

తాడేపల్లి రూరల్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్రమంతా పోటీచేస్తుందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ రమేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో మూడుసార్లు ఢిల్లీలోనూ, ప్రస్తుతం పంజాబ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పరచి, ఢిల్లీ అసెంబ్లీ ప్రధాన ప్రతిపక్ష పార్టీగాను, మరో మూడు రాష్ట్రాలలో ఎమ్మెల్యేలను కలిగి ఉన్న పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని పేర్కొన్నారు. పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు రాష్ట్రమంతా పర్యటించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోకల వరదరాజ సాంచీ, పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శీతల్ మదాన్, రాష్ట్ర అధికారప్రతినిధి కాళ్ళూరి కృష్ణమోహన్, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ రాచపూడి వెంకట నరసింహారావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరి సంగటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బండారుపల్లి జక్కమ్మ తల్లి ఆలయంలో చోరీ

నెలలో రెండోసారి చోరీ!

బండారుపల్లి(తాడికొండ): తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలోని జక్కమ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె వాసు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయం తెరిచేందుకు ఉదయం 4:50 గంటలకు పూజారి వెళ్ళిచూడగా హుండీ తాళం విరిగినట్లు గుర్తించి సీసీ కెమేరాలను పరిశీలించారు. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగలగొట్టి డబ్బును దొంగిలిచినట్లు కెమేరాలో రికార్డు అయింది. గుంటుపల్లి సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు.

ఎకో పార్కులో పాములపై అవగాహన

మంగళగిరి టౌన్ : అక్టోబర్ 2వ తేదీ నుండి 8వ జరుగుతున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మంగళగిరి ఎకో పార్కులో బుధవారం విద్యార్థులకు పాములపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈస్టరన్ ఘాట్ సొసైటీ ఎన్‌జీవో అధ్యక్షులు మూర్తి, ప్రతినిధులు, అటవీశాఖ, పార్కు సిబ్బంది పాము కరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి హిమ శైలజ, ఫారెస్ట్ రేంజ్ అధికారులు శ్రీవిద్య, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలెంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వాహనం నడిపాడని, అదే సమయంలో రోడ్డు పక్కన నిలబడి స్నేహితులతో మాట్లాడుతూ ఉన్న శంకర్ (40) అనే వ్యక్తిని ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

తాడికొండలో భారీ చోరీపై ఫిర్యాదు

తాడికొండ: తన ఇంటిలో భారీ చోరీ జరిగిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండ ప్రధాన రహదారి వెంబడి గృహంలో రూ. 5 లక్షల నగదు, రూ.30 లక్షల విలువైన బంగారం దొంగలు అపహరించారంటూ బుధవారం ఉదయాన్నే పఠాన్ ఖాజావలి అనే వ్యక్తి తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సీఐ కె.వాసు, ఎస్ఐ జోజిలు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేయడంతో పాటు క్లూస్ టీంను ఘటనా స్థలానికి రప్పించారు. అయితే ఎలాంటి ఆనవాళ్ళు లభించకపోవడంతో ఇది ఇంటి దొంగల పనిగా భావించి ఆ దిశగా విచారణ మొదలు పెట్టారు. అందులో భాగంగా వారే నగదు పోయినట్లు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు ఒప్పుకున్నారని సమాచారం. ఈ నేపథ్యం అసలేం జరిగింది, ఎందుకు తప్పుడు ఫిర్యాదు చేశారు అనే దానిపై పోలీసులు పూర్తి విచారణ కొనసాగిస్తున్నారు. విచారణ పూర్తయితే కానీ అసలు విషయం వెల్లడయ్యే అవకాశాలు లేవు.

కటికల పోలుకు నివాళి

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు సీపీఎం కార్యాలయంలో బుధవారం నాయకులు కటికల పోలు వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా కటికల పోలు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గం కోసం సీఐటీయూ జెండా అండతో తుదిశ్వాస దాకా నిస్వార్థంగా పని చేసిన వ్యక్తి పోలు అని అన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, దర్శన విజయబాబు, కోట బాబూరావు, సామెల్, గోపమ్మ, ఫిరోజ్, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి రెండు బస్సులు

మంగళగిరి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అమరావతికి రెండు బస్సులను నూతనంగా నడుపుతున్నామని డిపో మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నుండి అమరావతి రూట్ ఉదయం 6.00, 7.30, 8.00, 10.30, 12.00, మధ్యాహ్నం 1.30,3.00, సాయంత్రం 4.30,6.00, రాత్రి 9.15 ని''లకు బయలుదేరతాయని, అమరావతి నుండి మంగళగిరికి ఉదయం 6.00, 7.30, 8.00, 10.30, 12.00, మధ్యాహ్నం 1.35, 3.00, సాయంత్రం 4.30, 6.00, రాత్రి 7.30 గంటలకు బయలుదేరతాయని ప్రయాణీకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కెఎల్‌యూలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కెఎల్ యూనివర్శిటీలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైకాలజిస్ట్ జి. హరిత ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ ఫిజికల్ హెల్త్‌తో పాటు మెంటల్ హెల్త్ పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యాన్ని విద్యార్థులు ఎలా వృద్ధి చేసుకోవాలో వివరించారు. ఎఫ్ఇడి ప్రిన్సిపల్ డాక్టర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏ విద్యార్థి అయితే మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారో వారు సరైన నిర్ణయాలు తీసుకుని ఒత్తిడిని అధిగమించగలరని వివరించారు. వర్శిటీ వీసీ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు, డాక్టర్ ఎస్. వెంకటరామన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్, క్లినికల్ సైకాలజీ ట్రైనీస్ నిఖిల్ రెడ్డి, మాధురి, మానిని, శిరీష, వర్శిటీ సైకాలజిస్టులు శంకరి, శిరీష, రాజేశ్వరి, శ్రీనాథ్, మౌనిక, భాను, విజయరత్నం, కిషోర్ పాల్గొన్నారు.

కల్తీ మద్యం ప్రాణాలు హరిస్తోంది

జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ



మాట్లాడుతున్న కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతూ ప్రజల ప్రాణాలను హరిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేటలోని ఆమె నివాసంలో బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం కుంభకోణాలు వెలికి వస్తున్నాయని చెప్పారు. ఈ పరిణామాలతో మహిళలు ఎంతోకలత చెందుతున్నారన్నారు. ఇంతటి దారుణంగా కల్తీమద్యం బెల్టుషాపులకు చేర్చుతూ ప్రజల ప్రాణాలతో కూటమి నాయకులు ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కూటమి నాయకులు చేసిన ఆరోపణలు బూటకాలుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. అప్పుడు మద్యం ప్రియుల పొట్టకొట్టారని ఆరోపించిన కూటమి నాయకులు ఈరోజు ఈ కల్తీ మద్యం గురించి మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను నేటి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసేందుకు సిద్ధపడటం దారుణమన్నారు. అటువంటివి చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తామని చెప్పారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్లు డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లు

మంగళగిరి టౌన్: దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను రద్దుచేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య, మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్లు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట కార్యాలయంలో మతోన్మాదం ఫాసిస్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతి శీల కార్మిక సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. కొండారెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 19న రాష్ట్ర అసెంబ్లీలో ప్రపంచ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కును రద్దు చేస్తూ 13 గంటలు చేయాలని, అలాగే ఒక రోజు సమయంలో రోజున్నర పని చేయాలని తీర్మానించారని అన్నారు. ఆ తీర్మానంలో మహిళా కార్మికులకు కూడా నైట్ షిఫ్టులు పనిచేయాలని చేర్చారని, ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన తరువాత ప్రజల వద్ద కారు చౌకగా భూములు గుంజుకుని పెట్టుబడి దారులకు అన్యాక్రాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆటో డ్రైవర్లుకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, స్త్రీశక్తి పథకం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయలు ఆటో యజమానికి కాకుండా డ్రైవర్లకు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ప్రతి నెల ఆటో డ్రైవర్‌కు 5 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని, ఆటో డ్రైవర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, స్పేర్ పార్టుల ధరలను తగ్గించి ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్కే శ్రీను, యూనియన్ కోశాధికారి జాన్ సైదా, కాశేశ్వరరావు మార్కెట్ యూనియన్ ప్రెసిడెంట్ ఖాసిం, ఉపాధ్యక్షులు బాలు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి ఆర్టీసీ డ్రైవర్ వేతనాల్లో వివక్ష

మంగళగిరి టౌన్: రాజధాని ప్రాంతమైన మంగళగిరి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్యూటీ డ్రైవర్స్ వేతనాలు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి డిపోలో వివక్ష నడుస్తోందని గుంటూరు జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్, జిల్లా కమిటీ సభ్యులు నాగుర్ వలి, మంజుశ్రీ, శ్రీదర్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆన్‌కాల్ డ్రైవర్లకు సింగిల్ డ్యూటీకి వెయ్యి రూపాయలు, డబుల్ డ్యూటీకి 2 వేల రూపాయలు ఇస్తుంటే మంగళగిరిలో మాత్రం డబుల్ డ్యూటీకి 1600 రూపాయలు మాత్రమే ఇస్తూ డ్రైవర్లను ఇబ్బంది పెట్టి బాధపెడుతున్నారన్నారు. మంగళగిరి డిపోలో సుమారుగా 20 మందికి పైగా ఆన్‌కాల్ డ్రైవర్లు ఉన్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్నిచోట్లా ఎలా ఇస్తున్నారో అలాగే మంగళగిరి డిపోలో కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచలేదని, దీంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఒక బస్సులో 100 మంది నుంచి 120 మంది దాకా ప్రయాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా ప్రజల పట్ల భద్రత వహించాలని, బస్సుల సంఖ్య పెంచాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యను పాలకులు పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో కార్మికుల మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: అధికారంలో ఉన్న పాలకులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే కార్మికుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. సంపద సృష్టికి కార్మికుల శ్రమే మూలమని ప్రపంచం చెబుతుంటే, పెట్టుబడి దారులే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సారమ్మ, రమాదేవి, రిబ్కా, ఏడుకొండలు, అంకమ్మ, సాంబశివరావు, సుబ్బారావు, సుభాని, నాగేశ్వరరావు, దుర్గాభవాని, రమణమ్మ, హగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వాక్సినేషన్ వేయిస్తాం

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: పట్టణంలో 258 కుక్కలకు ఏబీసీ, ఏఆర్‌వీ వ్యాక్సిన్లు వేయాల్సిందని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 5,908 వీధి కుక్కలను గుర్తించడం జరిగిందని, అక్టోబర్ 2025 వరకు 5650 కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించామని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్ 30 నాటికి మిగిలిన శునకాలను వ్యాక్సినేషన్ వేయిస్తామని తెలియజేశారు. మంగళగిరి మండల పరిధిలోని కాజ గ్రామంలో ఏబీసీ, ఏఆర్‌వీ వ్యాక్సినేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే వీధికుక్కల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, సమస్యను 7093912653, 08645295192 నెంబర్లు తెలియజేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

తాడేపల్లి రూరల్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ఫార్చ్యూన్ గ్రాండ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, న్యాయవ్యవస్థకు ఇది తీరని అవమానమని అన్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం కలిగి వున్న ప్రతి పౌరుడు ఈ దాడిని తీవ్రంగా ఖండించాలని పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్యనాయకులు పాత్లావత్ దుర్గ నాయక్, ఇస్లావత్ హనుమంతు నాయక్, జరపల కృష్ణ నాయక్, మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.